బాల్యంలో చక్కెర నియంత్రణతో మధుమేహానికి చెక్!

న్యూఢిల్లీ: చిన్నారుల జీవితంలోని తొలి వెయ్యి రోజులు చక్కెరను నియంత్రించడం, ఇంకా చెప్పాలంటే మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి రెండేళ్లపాటు చక్కెర తీసుకోవడాన్ని తగ్గిస్తే పెద్దయ్యాక దీర్ఘకాలిక వ్యాధుల ముప్పును గణనీయంగా తగ్గించవచ్చని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. 'సైన్స్' జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. ప్రారంభ జీవితంలో చక్కెరను తీసుకోవడం తగ్గిస్తే టైప్-2 డయాబెటిస్ ముప్పును 35 శాతం, రక్తపోటును 20 శాతం తగ్గించవచ్చు. వీటి రాకను కూడా ఆలస్యం చేయవచ్చు. సౌత్ కాలిఫోర్నియా యూనివర్సిటీ నిర్వహించిన ఈ అధ్యయనం ప్రకారం చక్కెరను తగ్గించడం వల్ల పిల్లల్లో ఊబకాయం వచ్చే ప్రమాదం 30 శాతం తగ్గింది. రెండో ప్రపంచ యుద్ధం నుంచి కోలుకుంటున్న సమయంలో యూకేలో చక్కెర రేషన్ కారణంగా దాదాపు 60 వేల మంది ప్రభావితమయ్యారని పరిశోధకులు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మార్గదర్శకాల ప్రకారం రెండేళ్లలోపు చిన్నారులు అదనపు చక్కెర తీసుకోకూడదు. పెద్దలు ఏడు స్పూన్లకు మించి చక్కెర తీసుకోకుండా లక్ష్యం పెట్టుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ 12 స్పూన్లకు మించి లేదా 50 గ్రాములకు మించి చక్కెర తీసుకోకూడదు.

ఇరాన్ వర్సిటీలో దుస్తులు విప్పి నిరసన

హిజాబ్‌కు వ్యతిరేకంగా విద్యార్థిని ఆందోళన!

టెహ్రాన్ : ఇరాన్‌లో డ్రెస్ కోడ్ (హిజాబ్)కు వ్యతిరేకంగా ఓ యువతి యూనివర్సిటీలో దుస్తులు విప్పి నిరసనకు దిగింది. ఇస్లామిక్ ఆజాద్ యూనివర్సిటీకు చెందిన ఓ విద్యార్థిని శనివారం వర్సిటీ వద్ద తన దుస్తులు విప్పి, లోదుస్తులతో నిరసనకు దిగటం సంచలనం రేపింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో ప్రసారమయ్యాయి. హిజాబ్ ధరించలేదని పోలీసులు కొట్టడం వల్లే ఆమె ఈ విధంగా నిరసనకు దిగిందని వార్తలు వెలువడ్డాయి. ఇరాన్ పోలీసులు ఆమెను కొట్టారని వార్తలు వెలువడ్డాయి. ఆమె అరెస్టును ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఖండించింది. ఆమెను వెంటనే విడుదల చేయాలని కోరింది. ఆమె తీవ్రమైన వేధింపులను ఎదుర్కొంటున్నారని ఇరాన్ హక్కుల గ్రూపులు ఆందోళన వ్యక్తం చేశాయి.

త్వరలో టోల్ ప్లాజాలకు చెల్లు!

- దేశంలోనే తొలిసారి ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేపై ఎంఎల్‌ఎఫ్‌ఎఫ్ టోల్ కలెక్షన్ సిస్టం ఏర్పాటు
- ఫీజు వసూళ్లకు బ్యాంకులకు ఆహ్వానం

న్యూఢిల్లీ, నవంబర్ 3: దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ఉన్న టోల్ ప్లాజాలు త్వరలో కనుమరుగు కానున్నాయి. వాటి స్థానంలో వాహనదారుల నుంచి టోల్ ఫీజును వసూలు చేసేందుకు ఫీల్డ్ ఎక్విప్‌మెంట్, సెన్సర్లతో కూడిన సరికొత్త మల్టీ-లేన్ ఫ్రీ ఫ్లో (ఎంఎల్‌ఎఫ్‌ఎఫ్) టోల్ కలెక్షన్ వ్యవస్థలు అందుబాటులోకి రానున్నాయి. రహదారులపై వాహనాలు ఎలాంటి ఆటంకం లేకుండా ముందుకు సాగేందుకు వీలుగా భౌతిక టోల్ ప్లాజాలను తొలగించేందుకు ప్రయత్నిస్తున్న జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ).. దేశంలోనే తొలిసారి ఢిల్లీలోని ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేపై ఎంఎల్‌ఎఫ్‌ఎఫ్ టోల్ కలెక్షన్ వ్యవస్థ ద్వారా టోల్ ఫీజును వసూలు చేసేందుకు బ్యాంకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ ప్రణాళిక విజయవంతమైతే మొత్తం 28 కి.మీ. పొడవు ఉండే ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేపై ఒక్క టోల్ ప్లాజా మాత్రమే ఉంటుంది. ఆ రహదారిపై ప్రయాణించే వాహనాల నుంచి ఎంఎల్‌ఎఫ్‌ఎఫ్ టోల్ కలెక్షన్ వ్యవస్థ సేకరించి, పంపే డాటా ఆధారంగా సదరు వినియోగదారుల ఫాస్టాగ్ వాలెట్ నుంచి బ్యాంకే టోల్ ఫీజును రాబడుతుంది. ఒకవేళ టోల్ ఫీజును చెల్లించకపోతే ఆ విషయం వెహికల్ పోర్టల్‌తోపాటు ఫాస్టాగ్ యాప్‌లో కనిపిస్తూ ఉంటుంది. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేపై ఎంఎల్‌ఎఫ్ టోల్ కలెక్షన్ వ్యవస్థ విజయవంతమైతే ఇతర ఎక్స్‌ప్రెస్‌వేలపై ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ భావిస్తున్నది.

సౌదీ అరేబియా ఒయాసిస్సులో 4 వేల ఏండ్ల నాటి పట్టణం

న్యూఢిల్లీ: సౌదీ అరేబియా వాయవ్య ప్రాంతంలోని ఓ అందమైన ఒయాసిస్సులో 4 వేల ఏండ్లనాటి పురాతన పట్టణాన్ని పురావస్తు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఖైబర్ ఒయాసిస్సు కింద కనుగొన్న ఈ పట్టణాన్ని అల్-నతాహ్‌గా పిలుస్తున్నారు. అప్పటి ప్రజలు సంచార జీవనం నుంచి నగర జీవన శైలికి ఎలా మారారన్న దానికి ఈ పట్టణం అద్దంపడుతున్నది. ఫ్రెంచ్ పురావస్తు శాస్త్రవేత్త గుయిలౌమ్ చార్లక్స్ నేతృత్వంలోని బృందం ఈ పట్టణాన్ని కనుగొంది. 2.6 హెక్టార్లలో నిర్మించిన ఈ పట్టణంలో 14.5 కిలోమీటర్ల పొడవైన పటిష్టమైన గోడ కూడా ఉంది. 'పీఎల్‌వోఎస్ వన్' జర్నల్‌లో ప్రచురితమైన ఇటీవలి అధ్యయనం ప్రకారం ఈ గోడను నివాస ప్రాంతం చుట్టూ నిర్మించారు. ఈ పట్టణం కాంస్య యుగం ప్రారంభంలో అంటే క్రీస్తు పూర్వం 2400-2000 సంవత్సరం నాటిదిగా గుర్తించారు. అప్పటి నుంచి క్రీస్తు పూర్వం 1500 నుంచి 1300 సంవత్సరాల వరకు ఈ పట్టణం కొనసాగి ఉంటుందని చెప్తున్నారు. ఇక్కడ 500 మంది వరకు నివసించే వారని అంచనా వేస్తున్నారు.

కేదార్‌నాథ్, యమునోత్రి ఆలయాల మూసివేత

డెహ్రాడూన్: శీతాకాలం సందర్భంగా కేదార్‌నాథ్, యమునోత్రి ఆలయాలను మూసేశారు. ఈ సందర్భంగా ఆదివారం వైదిక ఆచారాల ప్రకారం నిర్వహించిన భాయి దూజ్ ఉత్సవానికి 18 వేల మందికి పైగా యాత్రికులు హాజరయ్యారు. అనంతరం ఉదయం 8.30 గంటలకు కేదార్‌నాథ్, మధ్యాహ్నం 12.05కు యమునోత్రి మహా ద్వారాలను మూసేశారు. ఆ తర్వాత కేదార్‌నాథ్‌లోని శివ భగవానుడి విగ్రహాన్ని పల్లకీలో బయటకు తెచ్చి ఉఖీ మఠానికి, యమునోత్రిలోని యమునా దేవి విగ్రహాన్ని ఖార్సాలీకి తరలించారు. చలి కాలమంతా అక్కడే ఆ దేవుళ్లకు పూజలు నిర్వహించనున్నారు.

జమిలికి వ్యతిరేకంగా టీవీకే తీర్మానం

చెన్నై: కేంద్ర ప్రతిపాదిత జమిలి ఎన్నికలను తమిళ నటుడు విజయ్ పార్టీ తమిళగ వెట్రి కజగం(టీవీకే) వ్యతిరేకించింది. ఆదివారం పార్టీ కార్య నిర్వాహక మండలి సమావేశంలో ఈ మేరకు ఒక తీర్మానం చేసింది. తమిళనాడు నుంచి నీట్ పరీక్షను ఉపసంహరించుకోవాలని కూడా డిమాండ్ చేసింది. రాష్ట్రంలో కుల గణన నిర్వహించకుండా దానికి కేంద్రాన్ని బద్నాం చేస్తున్నారని డీఎంకే ప్రభుత్వంపై మండిపడింది. అధికారంలోకి రావడానికి అబద్ధాలతో కూడిన హామీలను ఇచ్చారని డీఎంకేపై విరుచుకుపడింది.

యూపీలో 27,000 ప్రభుత్వ బడుల మూసివేత!

లక్నో: బీజేపీ పాలిత యూపీలో దాదాపు 27 వేల ప్రభుత్వ పాఠశాలల మూసివేతకు రంగం సిద్ధమైంది. 50 కన్నా తక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలలను మూసివేయాలని రాష్ట్ర విద్యా శాఖ నిర్ణయించింది. విద్యా శాఖ డైరెక్టర్ జనరల్ కంచన్ వర్మ గత నెల 23న బ్లాక్ స్కూల్ అడ్మినిస్ట్రేటర్ల సమావేశంలో మాట్లాడుతూ, పనితీరు సక్రమంగా లేని బడులను గుర్తించాలని ఆదేశించారు. తక్కువ మంది విద్యార్థులున్న బడులను సమీపంలోని ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్లో విలీనం చేయాలన్నారు. 50 మంది కన్నా తక్కువ మంది విద్యార్థులున్న బడులు 27,764 ఉన్నాయి.

నువ్వా..నేనా?

- రేపే అమెరికా అధ్యక్ష ఎన్నికలు
- ట్రంప్, కమల మధ్య హోరాహోరీ
- ప్రపంచ దేశాల్లోనూ తీవ్ర ఉత్కంఠ
- ఫలితాన్ని నిర్ణయించనున్న 7 రాష్ట్రాలు

వాషింగ్టన్, నవంబర్ 3: అగ్రరాజ్యం అమెరికా అధ్యక్ష ఎన్నిక పోరు తుది అంకానికి చేరుకుంది. నవంబర్ 5న జరిగే ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ పార్టీ తరఫున దేశ ఉపాధ్యక్షురాలు, భారత సంతతికి చెందిన కమలా హారిస్ బరిలో నిలిచారు. అమెరికా చరిత్రలో మునుపెన్నడూ లేనంతగా ఇద్దరు మధ్యా నువ్వా నేనా అన్నట్టుగా పోటీ నెలకొంది. శుక్రవారం ఇరువురు నేతలు విస్కాన్సిన్‌లో తుది ప్రచారం నిర్వహించడం విశేషం. ఈ ఇద్దరిలో ఎవరు విజేతగా నిలుస్తారో అని అటు అమెరికాతో పాటు ప్రపంచ దేశాలు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.

ఇప్పటికే 4.1 కోట్ల మంది అమెరికన్లు బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అమెరికా చరిత్రలో ఇప్పుడు జరుగుతున్నంత ఉత్కంఠ భరిత పోటీ గతంలో ఎన్నడూ జరగలేదని చరిత్రకారులు పేర్కొంటున్నారు. మంగళవారం 5వ తేదీన పోలింగ్ జరిగినప్పటికీ అధ్యక్షునిగా ఎన్నికైన వారు 2025 జనవరి 20 తర్వాతే బాధ్యతలు చేపడతారు. సాధారణంగా ఎన్నికైన సాయంత్రమో, మరునాడో మీడియా సంస్థలు తమకు ఉన్న డాటా ఆధారంగా విజేత ఎవరో ప్రకటించేస్తాయి. అసోసియేటెడ్ ప్రెస్ లాంటి పెద్ద మీడియా సంస్థలు ఓటింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే తాము ఏర్పాటు చేసిన 'కాల్' ఔట్‌లెట్ల ద్వారా రాష్ట్రాల్లోని విజేతలను ప్రకటించడం ప్రారంభిస్తాయి. 270 అంతకన్నా ఎక్కువ ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు తెచ్చుకున్న అభ్యర్థి అగ్రరాజ్యం అధ్యక్ష పీఠాన్ని అధిరోహిస్తారు.

ఆ ఏడు రాష్ట్రాల్లో ఆధిక్యం వస్తేనే..

అధ్యక్ష అభ్యర్థుల తలరాతను ముఖ్యంగా అమెరికాలోని ఏడు రాష్ట్రాలు నిర్ణయిస్తాయి. జార్జియా, మిషిగన్ సహా ఏడు రాష్ట్రాల్లో ఆధిక్యం పొందిన వారే అధ్యక్షుడవుతారని విశ్లేషకులు భావిస్తున్నారు. పెన్సిల్వేనియాలోని 19 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లు అధ్యక్ష ఎన్నికల్లో కీలకంగా నిలిచాయని గత అధ్యక్ష ఎన్నికలు రుజువుచేసినట్టు టెలిగ్రాఫ్ తన కథనంలో పేర్కొంది. 2024 ఎన్నికల్లోనూ ఈ రాష్ట్రం ఓట్లు కీలకంగా ఉన్నాయని తెలిపింది.

స్వింగ్ స్టేట్స్‌లో పోటాపోటీ (న్యూయార్క్‌టైమ్స్ పోల్)

రాష్ట్రం	ట్రంప్	కమల
నెవాడా	46%	49%
నార్త్ కరోలినా	46%	48%
విస్కాన్సిన్	47%	49%
జార్జియా	47%	48%
పెన్సిల్వేనియా	48%	48%
మిషిగన్	47%	47%
అరిజోనా	49%	45%

కాగా, 2020 ఎన్నికల్లో జో బైడెన్‌కు స్వల్ప ఆధిక్యం ఇచ్చి ట్రంప్‌కు త్రుటిలో అధికారాన్ని చేజార్చిన ఆరిజోనా, జార్జియా, విస్కాన్సిన్, నెవాడా ఫలితాలపై అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ ప్రాంతంలో ఒపీనియన్ పోల్స్ గురించి పరిశీలిస్తే కమలా హారిస్‌కు నెవాడా, నార్త్ కరోలినాల్లో స్వల్ప ఆధిక్యం ఉండగా, అరిజోనాలో ట్రంప్ ముందంజలో ఉన్నారు. మిషిగన్, జార్జియా, పెన్సిల్వేనియాలో ఇద్దరి మధ్య పోటాపోటీ నడుస్తున్నది. ఈ ఏడు రాష్ట్రాల్లో ఎవరికి ఆధిక్యం వచ్చినా 3.5 శాతం తేడాయే ఉంటుందని అంచనా.

తటస్థ ఓటర్లే కీలకం

ప్రముఖ శాంపిల్ సర్వే గాలప్ పోల్ డాటా ప్రకారం 2024 ఎన్నికల్లో ఓటు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 27 శాతం, డెమొక్రట్లకు, 27 శాతం రిపబ్లికన్లకు మద్దతు ఇస్తున్నట్టు చెప్పగా, 43 శాతం స్వతంత్ర ఓటర్లుగా ప్రకటించుకున్నారు. అంటే వీరు ఏ పార్టీకి మద్దతు ఇచ్చేది ప్రకటించరు. గత ఎన్నికల్లో వీరు 30 శాతం ఉన్నారు. దీంతో వీరు ఏ పార్టీకి మద్దతు ఇస్తారో వారే విజేతగా నిలుస్తారని అంచనా.

రోజుల తరబడి..

సాధారణంగా అమెరికా ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత కూడా విజేత ఎవరనేది రోజుల తరబడి అంచనా వేయలేరు. 2020 నవంబర్ 3న ఎన్నికలు జరిగిన నాలుగు రోజులకు జోబైడెన్ ఎన్నికైనట్టు అధికారికంగా ప్రకటించారు. నవంబర్ 5నే ఓట్ల లెక్కింపు ప్రారంభమైనా తుది ఫలితాలకు రోజులు పట్టవచ్చు. అమెరికా కాలమానం ప్రకారం ఉదయం 6నుంచి రాత్రి 8 గంటల (భారత కాలమానం ప్రకారం 5వ తేదీ సాయంత్రం 4.30 నుంచి మరునాడు ఉదయం 6.30) వరకు పోలింగ్ జరుగుతుంది.

కడుపులో బ్యాటరీలు, బ్లేడ్లు, స్క్రూలు

14 ఏండ్ల బాలుడి మృతి

ఆగ్రా: బ్యాటరీలు, బ్లేడ్లు, స్క్రూలు వంటి 65 వస్తువులను మింగిన ఓ బాలుడు(14) క్లిష్టమైన శస్త్ర చికిత్స జరిగిన కొన్ని గంటలకే మృతి చెందాడు. గత నెల 28న ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ దవాఖానలో ఈ ఘటన జరిగింది. పేగు ఇన్‌ఫెక్షన్ వల్ల బాలుడు మృతి చెందాడని దవాఖాన అధికారి ఒకరు తెలిపారు. హాథ్రస్‌లో నివసించే బాలుడికి గత నెల 13న శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో ఆగ్రాలోని ఓ దవాఖానకు తీసుకెళ్లారు. ఆ తర్వాత అది నయమైనా, కడుపు నొప్పి తలెత్తడంతో సరైన చికిత్స కోసం నాలుగు నగరాలు తిరిగారు. చివరకు ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ దవాఖానలో చేసిన స్కానింగ్‌లో అతడి పొట్టలో 65 వస్తువులు గుర్తించి ఆపరేషన్ నిర్వహించారు.

షా వర్సెస్ ధోవల్

- ఎన్‌టీఆర్‌ఓలో ఆధిపత్య పోరు
- చీఫ్ నియామకంపై విభేదాలు

న్యూఢిల్లీ, నవంబర్ 3: భారత సాంకేతిక గూఢచారి విభాగం (ఎన్‌టీఆర్‌ఓ)పై ఆధిపత్యం కోసం కేంద్రంలోని ఇద్దరు ప్రముఖులు తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఎన్‌టీఆర్‌ఓ కొత్త చీఫ్ నియామకంపై కేంద్ర మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ మధ్య వివాదం ఏర్పడింది. ప్రస్తుత చీఫ్‌గా ఉన్న ఐపీఎస్ అధికారి అరుణ్ సిన్హా అక్టోబర్ 31న పదవీ విరమణ చేసినా, మరో రెండు నెలల పాటు డిసెంబర్ 31 వరకు ఆయన పదవీ కాలాన్ని పొడిగించారు. వాస్తవానికి ఎన్‌టీఆర్‌వో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ నేతృత్వంలోని జాతీయ భద్రతా మండలికి జవాబుదారీ. అయితే హోం మంత్రి అమిత్ షా ఇందులో జోక్యం చేసుకుంటున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఎన్‌టీఆర్‌ఓ చీఫ్ పదవికి సీఆర్‌పీఎఫ్ చీఫ్‌గా ఉన్న అనీశ్ దయాల్ సింగ్ పేరును హోం మంత్రిత్వ శాఖ ప్రతిపాదిస్తూ ఫైల్‌ను పంపింది. అయితే ఆ ఫైల్‌పై ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా పీఎంవో దానిని వెనక్కి పంపింది. గతంలో ఈ పదవికి మనోజ్ యాదవ్ (ఆర్‌పీఎఫ్ చీఫ్), రష్మీ రంజన్ స్వయిన్ (సీఐడీ డీజీ)ల పేర్లను అజిత్ ధోవల్ ప్రతిపాదించగా, దానిని హోం శాఖ అప్పట్లో తిరస్కరించింది. దానిని దృష్టిలో ఉంచుకునే ఇప్పుడు అమిత్ షా సిఫార్సు చేసిన వ్యక్తిని ధోవల్ తిరస్కరించినట్టు ప్రచారం జరుగుతున్నది.

మరాఠీల ఓట్ల కోసం మూడు సేనల పోరు

- షిండే, ఉద్ధవ్, రాజ్ హోరాహోరీ
- తేలనున్న ఠాక్రే వారసత్వం

ముంబై: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో మరాఠీల ఓట్ల కోసం మూడు సేనలు పోటీ పడుతున్నాయి. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే ఆధ్వర్యంలోని శివసేన (యూబీటీ), రాజ్ ఠాక్రే నాయకత్వంలోని మహారాష్ట్ర నవ నిర్మాణ సేన మరాఠీల మనసులను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. దీంతో ఈ ఓట్లు మొదటిసారి మూడుగా చీలిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజ్ ఠాక్రే పార్టీ ప్రభావం ఉద్ధవ్ నేతృత్వంలోని పార్టీపై ప్రతికూలంగా పడవచ్చునని విశ్లేషకులు చెప్తున్నారు. మరాఠీల ఓట్లు చీలడం వల్ల ఎక్కువగా లాభపడేది బీజేపీయేనని అంటున్నారు.

రాజ్ ఠాక్రే రంగ ప్రవేశంతో..

2009 లోక్ సభ ఎన్నికల్లో రాజ్ ఠాక్రే పార్టీ వల్ల ముంబై, థాణే, నాసిక్ ప్రాంతాల్లోని చాలా స్థానాల్లో బీజేపీ-శివసేన కూటమికి గట్టి దెబ్బ తగిలింది. ఫలితంగా కాంగ్రెస్ లాభపడింది. రాజ్‌కు కనీసం ఒక స్థానమైనా దక్కలేదు. ప్రస్తుత ఎన్నికల్లో శివసేన (యూబీటీ), ఎన్సీపీ (శరద్‌పవార్), కాంగ్రెస్ మహా వికాస్ అఘాడీగా పోటీ చేస్తున్నాయి. బీజేపీ, శివసేన (ఏక్‌నాథ్ షిండే), ఎన్సీపీ (అజిత్ పవార్) పార్టీలు మహాయుతిగా పోటీ చేస్తున్నాయి. ముంబై, దాని పరిసర నియోజకవర్గాల్లో శివసేన, శివసేన (యూబీటీ) పోటీ పడుతుండగా, ఆ స్థానాల నుంచే ఎంఎన్‌ఎస్ కూడా తన అభ్యర్థులను బరిలో దించింది. కొంత కాలంపాటు ఎన్నికల రాజకీయాలకు దూరంగా ఉన్న రాజ్ ఠాక్రే ప్రస్తుతం సర్వశక్తులు ఒడ్డి పోరాడుతున్నారు. తన కుమారుడు అమిత్‌ను బరిలో దించారు.

మహిమ్, వర్లిలో పోటాపోటీ

మహిమ్ నియోజకవర్గంలో ఈ మూడు సేనల మధ్య ముక్కోణ పోటీ హోరాహోరీగా జరగబోతున్నది. అమిత్ ఠాక్రే (ఎంఎన్‌ఎస్), సదా సర్వంకర్ (శివసేన), మహేశ్ సావంత్ (శివసేన-యూబీటీ) ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారు. అదే విధంగా వర్లిలో కూడా రసవత్తర పోరుకు రంగం సిద్ధమైంది. ఇక్కడి నుంచి ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు ఆదిత్య ఠాక్రే (శివసేన-యూబీటీ), సందీప్ దేశ్‌పాండే (ఎంఎన్‌ఎస్ సీనియర్ నేత), మిలింద్ దేవ్‌రా (శివసేన) పోటీ చేస్తున్నారు. అమిత్, ఆదిత్య సునాయాసంగా గెలిచే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

'మహా' ఎన్నికల బరిలో మనోజ్ జరాంగే

ముంబై, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): త్వరలో జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల బరిలో మరాఠా రిజర్వేషన్ కోసం పోరాడుతున్న మనోజ్ జరాంగే నిలువనున్నారు. ఆయన తన పార్టీ తరఫున ఏడుగురు అభ్యర్థులను పోటీ చేయించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించనున్నారు. అలాగే మరో ఆరు నియోజకవర్గాల్లో అధికార పార్టీ కూటమి అభ్యర్థుల ఓటమే లక్ష్యంగా ప్రచారం చేయనున్నారు. మరో 2 నియోజకవర్గాల్లో ఇతర పార్టీలకు మద్దతు ప్రకటించారు. అయితే మనోజ్ జరాంగే పార్టీ ప్రభావం ఎంతమేరకు ఉంటుందోనని అక్కడి రాజకీయవర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతున్నది.

బాబా సిద్దిఖీ లాగే యోగిని హత్యచేస్తాం

ముంబై పోలీసులకు బెదిరింపు

మహారాష్ట్ర యువతి అరెస్ట్

ముంబై: యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను బెదిరించిన యువతిని పోలీసులు అరెస్ట్ చేశారు. ముంబై ట్రాఫిక్ పోలీసుల వాట్సాప్‌కు శనివారం గుర్తు తెలియని ఓ నంబరు నుంచి యోగి 10 రోజుల్లోగా సీఎం పదవికి రాజీనామా చేయకపోతే, బాబా సిద్దిఖీ మాదిరిగానే హత్యకు గురవుతారని బెదిరింపు సందేశం వచ్చింది. దీనిపై దర్యాప్తు చేసిన పోలీసులు ఉల్హాస్ నగర్‌కు చెందిన ఫాతిమా ఖాన్ (24) ఈ బెదిరింపు సందేశాన్ని పంపినట్టు గుర్తించారు.

జార్ఖండ్‌లో యూసీసీ అమలుచేస్తాం:షా

రాంచీ, నవంబర్ 3: జార్ఖండ్‌లో బీజేపీ అధికారంలోకి రాగానే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలుచేస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. యూసీసీ నుంచి గిరిజనులకు మినహాయింపు కల్పిస్తామని ఆయన తెలిపారు. రాంచీలో బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టో 'సంకల్ప్ పత్ర'ను అమిత్ షా విడుదల చేశారు. గిరిజనుల హక్కులకు భంగం కలగకుండా యూసీసీని అమలుజేస్తామని హామీనిచ్చారు.

పశ్చిమాసియాలో అమెరికా బీ-52 బాంబర్లు

టెహ్రాన్, నవంబర్ 3: పశ్చిమాసియాలో తమ అధునాతన యుద్ధ విమానాలు బీ-52 బాంబర్లను అమెరికా మోహరించింది. దీనిపై ఇరాన్ చీఫ్ ఆయతుల్లా ఖమేనీ తీవ్రంగా మండిపడ్డారు. ఇజ్రాయెల్‌కు గట్టి సమాధానం చెబుతామని ఆయన హెచ్చరించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు రెండు రోజుల ముందు ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా యుద్ధ విమానాలు, ఇతర ఆయుధాలను పశ్చిమాసియాలో మోహరించింది. ఇరాన్‌ను ఎదుర్కొనేందుకు వీటిని మోహరిస్తున్నట్టు ప్రకటించింది. మరోవైపు ఇజ్రాయెల్ కమాండోలు లెబనాన్‌లో తమ దాడులను మరింత తీవ్రతరం చేసి దూసుకుపోతున్నారు. ఈ పరిణామాలపై ఖమేనీ మాట్లాడుతూ 'మా శత్రువులు అమెరికా, ఇజ్రాయెల్‌లు రెండూ దీనికి కచ్చితంగా తీవ్ర ప్రతిఫలం అనుభవించిక తప్పదు' అని అన్నారు.

'ఆఫీస్' ఉద్యోగుల మానసిక ఆరోగ్యం భేష్!

ఇంటి నుంచి పనిచేసే వారి కన్నా మెరుగు

న్యూఢిల్లీ, నవంబర్ 3: భారత్‌లో ఇంటి నుంచి పనిచేసే ఉద్యోగుల కన్నా ఆఫీస్ నుంచి పనిచేసే ఉద్యోగులు మెరుగైన మానసిక ఆరోగ్యాన్ని కలిగి ఉన్నారని అంతర్జాతీయ అధ్యయనం వెల్లడించింది. యూఎస్‌కు చెందిన సపియన్స్ ల్యాబ్స్ 65 దేశాల్లో 54 వేల మంది ఉద్యోగులను సర్వే చేసి ఈ వివరాలు వెల్లడించింది. పని ప్రదేశంలో బలమైన సంబంధాలు, అవసరాలు మానసిక ఆరోగ్యానికి దోహదం చేస్తాయని నివేదిక తెలిపింది. బలహీనమైన పని ప్రదేశ బంధాలు, అవసరలేమి దుఃఖానికి, నిరాశకు కారణమై ప్రేరణను తగ్గిస్తాయని పేర్కొంది. ఏ ఉద్యోగంలోనైనా సహోద్యోగులతో బలమైన సంబంధాలు కలిగి ఉండటం, సొంత పని పట్ల గర్వపడటం మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని వెల్లడించింది. బలహీనమైన పని ప్రదేశ సంబంధాలు, మానసిక ఒత్తిడికి మధ్య ఉన్న సహ సంబంధం భారత్‌లో తక్కువగా ఉంది. ప్రపంచ సగటు(16 శాతం), అమెరికాతో(18 శాతం) పోలిస్తే భారత్‌లో 13 శాతం ఉద్యోగులు పని ఒత్తిడిని భరించలేకుండా ఉన్నామని అభిప్రాయపడ్డారు.

శ్రీనగర్‌లో గ్రనేడ్ దాడి

10 మందికి గాయాలు

శ్రీనగర్, నవంబర్ 3: జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు మరింత రెచ్చిపోతున్నారు. ఆదివారం శ్రీనగర్‌లోని ఓ బిజీ మార్కెట్‌లో ఉగ్రవాదులు గ్రనేడ్ దాడికి పాల్పడ్డారు. గుర్తుతెలియని కొంతమంది ఇక్కడి మార్కెట్‌లోని గుంపుపైకి గ్రనేడ్ విసరగా, భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో కనీసం 10మందికి గాయాలైనట్టు తెలిసింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే టూరిస్ట్ రిసెప్షన్ సెంటర్‌కు సమీపంలో గ్రనేడ్ దాడి చోటుచేసుకోవటం కలకలం రేపింది. సమాచారం అందుకున్న భద్రతా బలగాలు, వైద్య బృందాలు వెంటనే ఘటనా స్థలికి చేరుకొని, గాయపడ్డవారిని శ్రీ మహారాజా హరిసింగ్ దవాఖానకు తరలించారు. దాడికి పాల్పడ్డవాళ్లను పట్టుకునేందుకు పోలీసులు సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టారు. దాడిని సీఎం ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా ఖండించారు. అమాయక పౌరులను టార్గెట్ చేయటాన్ని క్షమించరాని నేరంగా పేర్కొన్నారు. లష్కరే తాయిబా టాప్ కమాండర్‌ను భద్రతా బలగాలు తుదముట్టించిన మరుసటి రోజే శ్రీనగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది.

కుక్కలకు బిస్కెట్లు వేసి.. నిశ్శబ్దంగా నివాసాలను చుట్టుముట్టి..

చాకచక్యంగా లష్కరే కమాండర్ ఎన్‌కౌంటర్

శ్రీనగర్, నవంబర్ 3: లష్కరే తాయిబాకు చెందిన అగ్ర కమాండర్ ఉస్మాన్‌ను శనివారం భద్రతా దళాలు హతమార్చాయి. అయితే అతడిని హతమార్చడం అంత సులభంగా సాధ్యం కాలేదు. వారు 9 గంటల పాటు ప్రణాళిక వేసి ఎలాంటి పౌరనష్టం జరగకుండా విజయవంతంగా ఆపరేషన్‌ను ముగించారు. జనసమ్మర్దం ఎక్కువగా ఉన్న శ్రీనగర్‌లోని కన్యర్ అనే నివాస ప్రాంతంలో ఉస్మాన్ ఉన్నట్టు సమాచారం అందింది. దీంతో సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. దాడికి ముందు భద్రతా దళాలకు అక్కడ ఉన్న వీధి కుక్కలు పెద్ద సమస్యగా మారాయి. వీరు అక్కడికి చేరితే కుక్కలు వీరిని చూసి అరుస్తాయి. అలా చేస్తే ఉగ్రవాదులు అప్రమత్తమవుతారు. దీంతో వారు అవి అరవకుండా వాటికి బిస్కెట్లు వేసి మచ్చిక చేసుకున్నారు. దీంతో వీరు అక్కడకు చేరినా అవి అరవకపోవడంతో వారు అక్కడికి చేరుకున్నారు. తెల్లవారుజామున జరిపే ఫాజర్ ప్రార్థనలకు ముందే భద్రతా సిబ్బంది అక్కడి 30 ఇండ్లను చుట్టుముట్టారు. భద్రతా దళాలపై ఉస్మాన్ ఏకే 47, గ్రనేడ్, పిస్టల్ వంటి ఆయుధాలతో ఎదురుదాడి జరిపినా దానిని సమర్థంగా తిప్పికొట్టారు. కాల్పుల సమయంలో కొన్ని గ్రనేడ్లు పేలి ఒక ఇంటికి నిప్పంటుకోగా, అది మిగతా ఇండ్లకు వ్యాపించకుండా అధికారులు నిరోధించారు.

పాకెట్ తెరవకుండానే పాడైన పాల గుర్తింపు

ఫోన్ వైబ్రేషన్లతో గుర్తించే యాప్ అభివృద్ధి

సిడ్నీ, నవంబర్ 3: పాకెట్ తెరవకుండానే అందులోని పాలు పాడయ్యాయో లేదో కచ్చితంగా తెలుసుకొనే యాప్‌ను ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్‌వేల్స్ యూనివర్సిటీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. విబ్‌మిల్క్‌గా పిలిచే ఈ యాప్ స్మార్ట్ ఫోన్ వైబ్రేషన్ల(కంపనాలు) సాయంతో పాల నాణ్యతను చెప్పేస్తుంది. తాజా పాలు 6.6 పీహెచ్, పూర్తిగా పాడైనవి 4.4 పీహెచ్ కలిగి ఉంటాయి. స్మార్ట్‌ఫోన్‌లోని మోటార్‌ను ఉపయోగించి విబ్‌మిల్క్ యాప్ అంతర్గత కొలత యూనిట్ ఈ కంపనాలను నమోదు చేస్తుంది. మెషీన్ లెర్నింగ్ అల్గారిథమ్స్‌ను ఉపయోగించి ఈ యాప్ 23 పీహెచ్ విలువ వరకు నమోదు చేస్తుంది. రెండు రకాల వైబ్రేషన్ మోటార్లను నాలుగు సాధారణ స్మార్ట్‌ఫోన్లలో ఉపయోగించి ఈ యాప్‌ను పరీక్షించారు. ఈ యాప్ పాల పీహెచ్ విలువను 98.35 శాతం కచ్చితత్వంతో, తాజా, పాడైపోయిన పాలను వంద శాతం కచ్చితత్వంతో గుర్తించింది. పాల ప్యాకెట్‌కు ఫోన్‌ను అతికించి పాలు పాడయ్యాయా లేదా తెలుసుకోవచ్చు. ఈ యాప్ యాప్ స్టోర్లలో డౌన్‌లోడ్‌కు ఇంకా అందుబాటులోకి రాలేదు.

గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు!

న్యూఢిల్లీ, నవంబర్ 3: వచ్చే ఏడాది జనవరిలో జరిగే భారత గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబవో సుబియాంటోను ఆహ్వానించనున్నారు. ఆయన పేరు నిర్ధారణ అయితే భారత గణతంత్ర వేడుకల్లో ఇండోనేషియా నేతలు పాల్గొనడం ఇది నాలుగోసారి అవుతుంది. ఇండోనేషియా-భారత్ మధ్య ఆర్థిక, రక్షణ, సాంస్కృతిక రంగాల్లో పటిష్టమైన సంబంధాలు ఉన్నాయి.

'ఎస్సీ హోదా కమిషన్' గడువు మరో ఏడాది పొడిగింపు

ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, నవంబర్ 3: సిక్కు మతం, బౌద్ధ మతం కాకుండా ఇతర మతాలలోకి మారిన వ్యక్తులకు షెడ్యూల్డ్ కులాల హోదా కల్పించవచ్చునా లేదా అన్న అంశాన్ని పరిశీలించడానికి ఏర్పాటు చేసిన కమిషన్ గడువును మరో ఏడాది పొడిగించారు. వాస్తవానికి కమిషన్ గడువు ఈ ఏడాది అక్టోబర్ 10వ తేదీతో ముగిసింది. అయితే పరిశీలన ఇంకా పూర్తికాకపోవడంతో తుది నివేదికను అందజేయలేదు. దీంతో కమిషన్ గడువునే మరో సంవత్సరం పాటు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.